
నారాయణపేట శక్తిపీఠంలో లక్ష్మీదేవిగా..


నారాయణపేట మండలం సింగారంలో మహాచండీగా..


నారాయణపేటలో అన్నపూర్ణదేవిగా అమ్మవారు


నారాయణపేటలో మహాచండీ అలంకరణలో చౌడేశ్వరి మాత

మహాచండీ అవతారంలో అమ్మవారు


అమ్మవారికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే పర్ణికారెడ్డి


బిజ్వార్‌లో భవానీమాతకు ప్రత్యేక పూజలు చేస్తున్న ఆదిత్య పరాశ్రీ

● వైభవంగా నవరాత్రి ఉత్సవాలు

సాక్షి, నెట్‌వర్క్: నారాయణపేట మండలం సింగారం శ్రీగిరి పీఠంపైన భవానీమాత ఆలయంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఐదోరోజు మహాచండి దేవి అవతారంలో అమ్మవారు పూజలందుకున్నారు. పట్టణంలోని పలు మండలపాల్లో వివిధ రూపాల్లో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు.

- మక్తల్ పట్టణంలో కన్యకపరమేశ్వర ఆలయంలో వాసవి మాతను అన్నపూర్ణదేవిగా అలంకరించారు.
- మరికల్, మద్దూర్ మండలాల్లో మహాచండి దేవి అవతారంలో అమ్మవారు దర్శనమిచ్చారు.
- ఊట్కూరు మండలం బిజ్వార్‌లో అమ్మవారు ముగ్గురమ్మలుగా మహాంకాళి, మహాలక్ష్మి, మహాసరస్వతిగా దర్శనమిచ్చారు. భవానీ మందిర్‌లో సరస్వతిమాతగా పూజలు చేశారు.
- నర్వ మండలంలో లలితా త్రిపుర సుందరిదేవిగా అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు.


మక్తల్ కన్యకాపరమేశ్వర ఆలయంలో భరత నాట్యం చేస్తున్న యువతులు

నవరాత్రి ఉత్సవాల్లో ఎమ్మెల్యే

ధన్వాడ: నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నారాయణపేట నియోజకవర్గ ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి సోమవారం సోమవారం మండల కేంద్రంలోని మారుతినగర్‌లో ఏర్పాటు చేసిన అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కాలనీ వాసులు పుట్టింటి వాయనం అమ్మవారి చీరను ఎమ్మెల్యేకు అందజేశారు. కార్యక్రమంలో మాధవరెడ్డి, నరహరి, నరేందర్, లక్ష్మణ్‌గౌడ్ ఉన్నారు.


ఊట్కూరులో సరస్వతీమాతగా అమ్మవారు


నారాయణపేటలో మావుళ్ళమ్మ దేవిగా..


కోటకొండలో వనదుర్గదేవిగా వాసవిమాత


మద్దూర్‌లో ప్రత్యేక పూజలో పాల్గొన్న భక్తులు

మత్స్యకారుల ఆర్థికాభివృద్ధే లక్ష్యం


కొండారెడ్డిపల్లి చెరువులో చేప పిల్లలను వదులుతున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్, ఎమ్మెల్యే పర్ణికారెడ్డి

నారాయణపేట: మత్స్యకారులను ఆర్థికంగా అభివృద్ధి చేయడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి అన్నారు. సోమవారం జిల్లా కేంద్రానికి సమీపంలోని కొండారెడ్డిపల్లి చెరువులో గంగమ్మకు పూజలు నిర్వహించి 82,500 చేప పిల్లలను కలెక్టర్ సిక్తా పట్నాయక్‌తో కలిసి చెరువులో వదిలారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 100శాతం సబ్సిడీతో చేప పిల్లలను చెరువులలో వదలడం వల్ల మత్స్యకారులకు, ముదిరాజులకు మెరుగైన ఉపాధి పొందే వీలుంటుందన్నారు. చెరువులలో సమృద్ధిగా నీరు ఉన్నందున చేప పిల్లలు పెంచడానికి ప్రభుత్వం ఈమేరకు చర్యలుచేపట్టిందని అన్నారు.

మత్స్యకారులకు ప్రభుత్వం అండ.. : కలెక్టర్

కలెక్టర్ సిక్తా పట్నాయక్ మాట్లాడుతూ మత్స్యకారులకు ప్రభుత్వం అండగా నిలుస్తుందని, ఏవైనా సమస్యలుంటే మా దృష్టికి తీసుకురావాలని, పరిష్కరిస్తామని అన్నారు. ప్రస్తుతం జిల్లా ఇన్‌చార్జి డీఎఫ్‌ఓ విధులు నిర్వర్తిస్తున్నారని రెగ్యులర్ డీఎఫ్‌ఓ వచ్చేందుకు తమ వంతు చొరవ తీసుకుంటామన్నారు. డీఎఫ్‌ఓ కార్యాలయం పశుసంవర్ధక శాఖ పాత కార్యాలయంలో కొనసాగుతుందని భవనాల కొరతతో ఇబ్బందులు ఉన్నాయని మత్స్య సహకార సంఘాల వారు తమ దృష్టికి తీసుకువచ్చారని ఆ సమస్యను సైతం పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. రాష్ట్రంలోని వివిధ ప్రాజెక్టుల వద్ద చేపపిల్లల విత్తన ఉత్పత్తి కేంద్రాలను ఏర్పాటు చేస్తే బాగుంటుందని, కబ్జాలు, ఆక్రమణల నుంచి చెరువులు, కుంటలను కాపాడాలని మత్స్యసహకార సంఘం జిల్లా అధ్యక్షుడు ఎ.కాంతు కుమార్ కోరారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కొనంగేరి హన్మంతు, దామరగిద్ద సింగిల్ విండో అధ్యక్షుడు ఈదప్ప, జిల్లా మత్స్యశాఖ అధికారి వెంకయ్య, మత్స్య సహకార సంఘం జిల్లా ఉపాధ్యక్షులు నరసింహులు నాయుడు, డైరెక్టర్లు పాల్గొన్నారు.

మార్కెట్ యార్డు అభివృద్ధికి కృషి

స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డును అన్నివిధాలుగా అభివృద్ధి చేసేందుకు తనవంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి అన్నారు. మార్కెట్ యార్డులో నూతన వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ శివారెడ్డి బాధ్యతలను స్వీకరించారు. మార్కెట్ యార్డుకు సరుకు విక్రయించేందుకు వచ్చే రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నూతన పాలకవర్గం కృషి చేయాలన్నారు. మార్కెట్ వైస్ చైర్మన్ కొనంగేరి హన్మంతు, మున్సిపల్ చైర్‌పర్సన్ గందె అనసూయ పాల్గొన్నారు.

స్థలం కేటాయించాలని ఎమ్మెల్యేకు వినతి

జిల్లా కేంద్రంలో చాకలి ఐలమ్మ విగ్రహ ప్రతిష్ఠాపనకు స్థలం కేటాయించాలని కోరుతూ సీవీఆర్ భవన్‌లో ఎమ్మెల్యే డాక్టర్ చిట్టెం పర్ణికారెడ్డికి జిల్లా రజక సంఘం ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. ఇందుకు ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు. ఆ సంఘం తరపున ఎమ్మెల్యేను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో రజక సంఘం, ప్రజా, కార్మిక సంఘాల నాయకులు చంద్రశేఖర్, సాయి బన్న, వెంకటప్ప, గోపాల్, తదితరులు ఉన్నారు.

ధన్వాడకు రాష్ట్రస్థాయిలో గుర్తింపు

ధన్వాడ: మండల కేంద్రంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీలు విజయవతం కావడంతో ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి నిర్వాహకులు రవికుమార్, సాయినాథ్, రామకృష్ణలను క్యాంపు కార్యాలయంలో శాలువా పూలమాలతో సన్మానించారు.

గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాలి


నర్సరీని పరిశీలిస్తున్న ఎంపీడీఓ రహ్మతుద్దీన్

మాగనూర్: గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాలని, అందుకు పారిశుద్ధ్య కార్మికులు నిత్యం కృషి చేయాలని ఎంపీడీఓ రహ్మతుద్దీన్ అన్నారు. సోమవారం ఆయన మండలంలోని వర్కూర్‌లో గ్రామ పంచాయతీ కార్యాలయం, అంగన్‌వాడీ కేంద్రం, సెగ్రేషన్‌షెడ్, నర్సరీతో పాటు గ్రామంలోని పలు విధులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలోని పలు కాలనీలో పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా ఉందన్నారు. ముఖ్యంగా డ్రైయినేజీలు ఉన్న సీసీ రోడ్లపైనే మురుగు పారుతోందని దీని వల్ల ప్రజలకు అనారోగ్య సమస్యలు ఏర్పడుతాయన్నారు. వెంటనే పారిశుద్ధ్య సమస్య లేకుండా చూడాలని పంచాయతీ కార్యదర్శికి సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నర్సింహారెడ్డి, అంగన్‌వాడీ టీచర్స్, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధిహామీని వినియోగించుకోవాలి


కోల్పూర్‌లో సీసీ రోడ్డు పనుల వివరాలను సేకరిస్తున్న అధికారులు

మాగనూర్: ఉపాధిహామీ పథకాన్ని జాబ్‌కార్డు ఉన్న ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఎస్‌ఆర్పీ మహేష్ తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గ్రామాల్లో వలసల నివారణ కోసం స్థానికంగా ప్రజలకు పనులు కల్పించి వారికి ఆర్థికంగా మేలు చేసేందుకు ఉపాధిహామీ అమలు చేస్తున్నట్లు తెలిపారు. అందులో భాగంగా ఆర్థిక సంవత్సరానికి సంబంధించి గ్రామాల్లో నిర్వహించిన పనులను సామాజిక తనిఖీ చేపట్టినట్లు తెలిపారు. ఆయా గ్రామాల్లో ఉపాధిహామీ పథకం ద్వారా వేసిన సీసీ రోడ్లు, ఇతర పనులకు కొలతలు తీసుకుని ఆడిట్ నిర్వహించారు. ప్రజలు గ్రామ సభల్లో పాల్గొన్ని ఏవైనా అభ్యంతరాలు, సందేహాలు ఉంటే నివృత్తి చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఏపీఓ హర్షవర్ధన్, ఉపాధిహామీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

డే అండ్ నైట్ క్రికెట్ టోర్నీ ప్రారంభం


క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న ఎస్‌ఐ మురళి

మరికల్: మండల బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో సోమవారం రాత్రి 30 యార్డ్ సర్కిల్ డే అండ్ నైట్ క్రికెట్ టోర్నమెంట్‌ను ఎస్‌ఐ మురళి ప్రారంభించారు. ఈ పోటీలను మరికల్ క్రికెట్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. ఈ పోటీల్లో గెలుపొందిన విజేతలకు మొదటి బహుమతి కింద రూ.11,111, రెండో బహుమతి రూ. 5,555 అందజేయనున్నట్లు నిర్వాహకులు భానుప్రకాష్, సతీష్‌లు తెలిపారు. అనంతరం ఎస్‌ఐ మాట్లాడుతూ క్రీడలు ఆడటం వల్ల మానసికోల్లాసంతో పాటు ఆరోగ్యం వస్తుందన్నారు. కార్యక్రమంలో వీరన్న, హరిష్, సురేష్, భానుప్రకాష్, సతీష్, చెన్నయ్య, శ్రీకాంత్‌రెడ్డి, హరిష్, అంజనేయులు, నిఖిల్, మహేందర్‌లు పాల్గొన్నారు.

ప్రతి గ్రామంలో సభ్యత్వాలు పెంచాలి

● బీజేపీ రాష్ట్ర కోశాధికారి శాంతి కుమార్


మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర కోశాధికారి శాంతికుమార్

కోస్గి: గ్రామీణ స్థాయి నుంచి పట్టణ స్థాయి వరకు ప్రతి గ్రామంలో పార్టీ సభ్యత్వాలు పెంచాలని బీజేపీ రాష్ట్ర కోశాధికారి శాంతి కుమార్ సూచించారు. ఈ మేరకు సోమవారం నియోజకవర్గ పరిధిలోని ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ విజయం సాధించేలా అధిక సంఖ్యలో సభ్యత్వాలు చేయాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు పున్నం చంద్, మదన్, అసెంబ్లీ కన్వీనర్ నర్సింహులు, కో కన్వీనర్ కోటకొండ రాము, నాయకులు వెంకటేష్, శ్రీకాంత్, సతీష్ పాల్గొన్నారు.

దేశ భవిష్యత్ కోసం బీజేపీలో చేరాలి

కృష్ణా: ప్రతి పౌరుడు దేశ భవిష్యత్ కోసం బీజేపీలో చేరాలని జిల్లా కార్యదర్శి సోమశేఖర్‌గౌడ్ అన్నారు. మండలంలోని హిందుపూర్‌లో వివిధ పార్టీలకు చెందిన వ్యక్తులు బీజేపీలో చేరారు. కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి నర్సప్ప, నాయకులు మల్‌రెడ్డి, నర్సిరెడ్డి, ప్యాట్ల సిద్దప్ప పాల్గొన్నారు.

బీజేపీని బలోపేతం చేయాలి

మరికల్: గ్రామ స్థాయిల్లో బీజేపీని బలోపేతం చేయాలని జిల్లా అధ్యక్షులు పగడాకుల శ్రీనివాస్ అన్నారు. మరికల్‌లో పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం ప్రారంభించారు. మండలంలో రికార్డు స్థాయిలో సభ్యత్వ నమోదు కావాలని నాయకులకు, కార్యకర్తలకు సూచించారు. ఇందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాల్సిన బాధ్యత ఉందన్నారు. కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి నర్సన్‌గౌడ్, మండల అధ్యక్షులు భాస్కర్‌రెడ్డి, కన్వీనర్ వేణుగోపాల్, రమేష్, రాజేష్, చెన్నయ్య, అశోక్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేడు కల్యాణలక్ష్మీ చెక్కుల పంపిణీ

కృష్ణా: మండల కేంద్రంలోని రైతు వేదికలో మంగళవారం మధ్యాహ్నం 3 గంటలకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ చేయనున్నట్లు తహసీల్దార్ దయాకర్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి హాజరవుతున్నట్లు తెలిపారు.

మాగనూర్: మండల కేంద్రంలోని రైతువేదికలో మంగళవారం ఉదయం 9గంటలకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని మాగనూర్ ఇన్‌చార్జి తహసీల్దార్ సురేష్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు.

ఊట్కూరు: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేయనున్నట్లు ఒక ప్రకటనలో తెలిపారు.

ఎస్పీని కలిసిన పబ్లిక్ ప్రాసిక్యూటర్



నారాయణపేట: జిల్లా అసిస్టెంట్ సెషన్ కోర్టుకు నూతన పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా నియమితులైన కె.మేనుశ్రీ సోమవారం జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ యోగేష్ గౌతమ్‌కు పూల మొక్క అందించి మర్యాదపూర్వకంగా కలిశారు. ఎస్పీ ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు.

ఆస్పత్రిని సందర్శించిన డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ

ఊట్కూరు: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిని సోమవారం డీఎంఅండ్‌హెచ్‌ఓ డా. శైలజ సందర్శించారు. ఆస్పత్రిలో రికార్డులను తనిఖీ చేసి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఏప్రిల్ నెలలో జరిగిన మాతృ మరణాలపై ఆరా తీశారు. ప్రభుత్వ ఆస్పత్రిలో కాన్పులు చేయించుకునేలా గర్భిణులకు అవగాహన కలిపించాలని వైద్య సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది విజయ్‌కుమార్, కవిత, నర్సింహులు పాల్గొన్నారు.

ఇన్‌చార్జికి ధన్యవాదాలు

మద్దూర్: కోస్గి మార్కెట్ కమిటీ నూతన చైర్మన్‌గా నియమితులైన భీమప్ప కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. సోమవారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిసి శాలువా, పూలమాలతో సన్మానించారు. పార్టీ మండల అధ్యక్షుడు నర్సింహులు, సుభాష్ ఉన్నారు.

బంగారు బతుకమ్మ ఊయ్యాలో..


బతుకమ్మ వేడుకల్లో మహిళలు, యువతులు

కోస్గి: 'బతుకమ్మ.. బతుకమ్మ ఊయ్యాలో..బంగారు బతుకమ్మ ఊయ్యాలో' అంటూ సోమవారం పట్టణంలో బతుకమ్మ వేడుకలు మహిళలు, యువతులు కలిసి ఆడిపాడుతూ ఘనంగా నిర్వహించారు. పలు కాలనీల మహిళలు, యువతులు తీరొక్క పూలతో బతుకమ్మలను అందంగా అలంకరించి కోలాటాలు, బతుకమ్మ పాటలు, సాంస్కృతిక కార్యక్రమాలతో ఊరేగించారు. వీర శైవ సమాజం, అక్కమహాదేవి మహిళా సంఘం ఆధ్వర్యంలో స్థానిక శ్రీమల్లికార్జున ఆలయంలో బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. అనంతరం తోగపూర్ పరిధిలోని దండం చెరువులో నిమజ్జనం చేశారు.

దామరగిద్ద: మండల కేంద్రంలోని వాసవి కన్యకాపమేశ్వరి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో బతుకమ్మ శోభాయాత్ర చేపట్టారు. మహిళలు కోలాటం, బతుకమ్మ ఆటపాటలతో అలరించారు. కార్యక్రమంలో మహిళలు ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

9న రైతులకు మద్దతుగా పాదయాత్ర

● మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి

కోస్గి: గతంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఫార్మాసిటీ కోసం కొనుగోలు చేసిన 14వేల ఎకరాల భూములు అందుబాటులో ఉన్నప్పటికీ వాటిని పట్టించుకోకుండా ముఖ్యమంత్రి కొత్తగా కోడంగల్ నియోజకవర్గంలో చేపట్టే ఫార్మా కంపెనీ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ ఈ నెల 9న ఫార్మా బాధిత రైతులతో పాదయాత్ర చేపడుతున్నట్లు బీఆర్‌ఎస్ మాజీ ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులకు ఇచ్చిన మాట మేరకు రుణమాఫీ చేయలేని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతుల భూములను బలవంతంగా తీసుకొని ఫార్మా కంపెనీలు ఏర్పాటు చేస్తున్నాడన్నారు. గతంలో ఇచ్చిన హామీ మేరకు 6 గ్యారంటీలు అమలు చేయడంతో పాటు రైతులకు ఎలాంటి ఆంక్షలు లేకుండా రూ.2లక్షల రుణమాఫీ చేయాలన్నారు. రైతు రుణమాఫీ, ఫార్మా రైతులకు మద్దతుగా ఈ నెల 9న పోలేపల్లి ఎల్లమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి పాదయాత్ర ప్రారంభిస్తామన్నారు. పోలేపల్లి నుంచి కోడంగల్ వరకు చేపట్టే ఈ పాదయాత్రకు మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, ఎమ్మెల్సీ నవీన్ కుమార్ రెడ్డి సైతం హాజరవుతారన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ మాజీ చైర్మన్ శ్యాసం రామకృష్ణ, కౌన్సిలర్ జనార్దన్‌రెడ్డి, నాయకులు వెంకట్‌నర్సింహులు, సలీం, మోహన్‌గౌడ్, పకీరప్ప, మాజీ జెడ్పీటీసీ మహిపాల్, శ్రీను, వెంకటేష్, సాయప్ప, తదితరులు పాల్గొన్నారు.

వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో నిరసన


పేటలో నిరసన తెలుపుతున్న వామపక్ష నాయకులు



మక్తల్‌లో నిరసన చేపట్టిన వామపక్షాల నాయకులు

నారాయణపేట: పాలస్తీనా ప్రజలపై ఇజ్రాయిల్ చేస్తున్న సామ్రాజ్యవాద దురాక్రమణ దాడిని వెంటనే ఆపాలని సీపీఐ, సీపీఎం, సీపీఐఎంఎల్ మాస్ లైన్ పార్టీల నేతలు వెంకట్రాంరెడ్డి, కొండన్న, ప్రశాంత్‌లు డిమాండ్ చేశారు. సోమవారం జాతీయ వామపక్షాల దేశవ్యాప్త నిరసనల పిలుపు మేరకు జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతేడాది నుంచి సామ్రాజ్యవాద అమెరికా ప్రోద్బలంతో ఇజ్రాయిల్ పాలస్తీనా పై దురాక్రమణ దాడి మొదలు పెట్టి నేటికి సంవత్సరం అయిందన్నారు. పసి పిల్లలు, వృద్ధులు, మహిళలు పాలస్తీనా సాధారణ పౌరులు వేలాది మందికి పైగా మృతి చెందారన్నారు. వెంటనే పాలస్తీనా ప్రజలపై ఇజ్రాయిల్ దాడిని నిలిపేసి ప్రపంచ శాంతికి సహకరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నర్సింహులు, బలరాం, సీ వెంకటేష్ రజక, చెన్నప్ప, నర్సింలు, వ్యకాస గోపాల్, రైతుసంఘం అంజిలయ్య గౌడ్, నారాయణ పాల్గొన్నారు.

వామపక్షాల నిరసన..

మక్తల్: పాలస్తీనా ప్రజలపై యుద్ధం ఆపాలని వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాల్లో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇఫ్టూ జిల్లా ఉపాధ్యక్షుడు భుట్టో మాట్లాడుతూ పాలస్తీనపై ఇజ్రయిల్ చేపట్టిన యుద్ధం నేటితో సంవత్సరం కావస్తుందన్నారు. యుద్ధం వల్ల 90శాతం మంది తినడానికి తిండిలేక, బట్టలేక బిక్కుబిక్కు మంటున్నారన్నారు. ఇజ్రాయిల్‌కు అండగా ఉన్న అమెరిక సామ్రాజ్యవాదం నశించాలన్నారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకుడు అజయ్, శ్రీనివాస్, నారాయణ, శ్రీనివాసులు, శివరాజ్ పాల్గొన్నారు.

నాలా కబ్జాను అడ్డుకోవాలని వినతి

నారాయణపేట: పట్టణంలోని పళ్ల బజారులో నల్ల చెరువు నాలా కబ్జాకు గురవుతోందని, దాన్ని అడ్డుకొని రైతులకు న్యాయం చేయాలని కోరుతూ సోమవారం కలెక్టరేట్‌లో కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. సర్వే నెంబర్లు 690,699,690/1,690/2పొలాల పక్కనుంచి నాలా వెళ్తోందని, సర్వే నెంబర్ 700,701లో రియల్ ఎస్టేట్ వ్యాపారి దినేష్ వెంచర్ ఏర్పాటు చేసి చెరువు నాలాను కబ్జా చేసినట్లు పేర్కొన్నారు. దాంతో నాలా ద్వారా వెళ్లే నీరు తమ పొలాల్లోకి వస్తోందని, ఈ విషయం ఇరిగేషన్ ఏఈ, డీఈలకు విన్నవించినట్లు తెలిపారు. భవిష్యత్‌లో ఎలాంటి ఇబ్బందులు రాకుండా శాశ్వతంగా నాలాను కాపాడాలని రైతులు ఆశప్ప, నర్సింహులు, ఉసేనప్ప, మంగలి గోపాల్, గుత్తి రమేష్‌లు కోరారు.

ఎస్‌ఆర్ శంకరన్ వర్ధంతి

మద్దూర్: దివ్యాంగుల అభివృద్ధి కోసం ఎనలేని కృషి చేసిన మహనీయుడు ఎస్‌ఆర్ శంకరన్ అని పలువురు కొనియాడారు. ఈ మేరకు సోమవారం శంకరన్ 14వ వర్ధంతిని మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి దివ్యాంగుల సంక్షేమం కోసం ఆయన చేసిన సేవలను మరోమారు గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో కమిట్‌మెంట్ మండల కో ఆర్డినేటర్ రాధమ్మ, ఏపీఎం, సీసీలు, తదితరులు పాల్గొన్నారు.

నవరాత్రి ఉత్సవాలు జయప్రదం చేద్దాం

దామరగిద్ద: రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘం 99 ఏళ్ల పూర్తి చేసుకొని వందో ఏట అడుగిడుతున్న సందర్భంగా ఈ నెల 11 న శుక్రవారం నిర్వహించనున్న రూట్ మార్చ్, దసరా సంబరాలు విజయవంతం చేయాలని ఖండ కార్యవహ విజయ్‌రెడ్డి పిలుపునిచ్చారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల నుంచి వివేకానంద, అంబేడ్కర్ చౌరస్తాల మీదుగా స్థానిక భవానీమాత ఆలయం వరకు కరసేవకులతో కవాతు రూట్‌మార్చ్ నిర్వహించనున్నట్లు తెలిపారు. కరసేవకులు, హిందు బంధువులు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని కోరారు.